మెట్లెక్కిన తర్వాత తలెత్తి చూస్తే అక్కడ ఉంటుంది ఆ అమ్మాయి. ఏవేవో ఫైళ్ళు, కాగితాలు ముందేసుకొని ! అలికిడి విని తనూ తలెత్తి చూస్తుంది. ఎదురుగా కనిపించే నన్ను చూసి... కేవలం నన్ను చూసేనా అనేది ఇంకా నాకు తీరని సందేహమే ! చిరు నవ్వుల్ని చిందిస్తుంది. అంత వరకు కనపడని ఆ బుగ్గలమీది సొట్టలు మరింత లోతుకు పోయి నా మనసులో గిలిగింతలు పెడతాయి. పైన తిరుగుతున్న ఫాను గాలికే అయినా నాకుమాత్రం చెదిరి అల్లల్లాడే ఆ ముంగురులు నా కోసం ఎగిసి పడుతున సంతోష సముద్రపు కెరటాల్లా అనిపిస్తాయి 'నమస్కారం' అని వదిలే ఆ నమస్కార బాణం సూటిగా చెరకు వింటి నుంచి వచ్చిన పూలబాణం లాగ గుండెలోకి దూసుకొనిపోతుంది. అక్కడ ఆ బాధేం నాకు పులకింతల నిస్తుంది. కోటి పూనుర్ని చెపుతుంది, కొంటె కోర్కెలను రేపుతోంది.

ఇలా ఇంకా ఎన్నేళ్ళు సాగాలో నాకు తెలీటం లేదు. చాలాకాలంగా గుండె లోకి చేరి కాపురం పెట్టిన ఆ అమ్మాయిని ఇంటికి తెచ్చుకొని గృహ సామ్రాజ్యానికి పట్టాభిషేకం చేసి. పట్టమహిషిని చేసి నన్ను ఏలుకోమని చెప్పాలనిపిస్తుంది.

కానీ... ఎందుకో ... మోనికా ... అవును, ఆ అమ్మాయి పేరు మోనికా... వరకు వెళ్ళాక గుండె గొంతుకలోకి చేరి మాట్లాడనివ్వదు. పదాలు పలకాల్సిన పెదవులకు కనపడని సంకెళ్ళు పడి పోతాయి. అది ఏవేవో అంటూనే ఉంటాయి గానీ నావరకు నాకు ఆ పెదాలు రెండూ మోనికా ముందు మూగవే!


ఈరోజు నాకు కొండంత ధైర్యంగా ఉంది. తెచ్చుకొన్నాను, ఎక్కడెక్కడి శక్తుల్నీనూ! వెళ్ళి అడిగేస్తా. అడిగిన ఇచ్చునా? 'అడుగుడి, మీకు ఇచ్చెదన్' అనేదే నాకు ధైర్యాన్ని ఇచ్చింది.

అడిగేస్తాను. అహ్వానిస్తాను. అదరిస్తాను—ఇదంతా ఎటొచ్చీ ఆమె 'వూ' అంటేనే!

'ఊహు' అంటేనో?


అనదు ! అనదని ఆమెతో నాకున్న గత పరిచయమే చెప్తోంది. ఎన్ని జన్మల బంధమిది—ఈ అనుబంధాన్ని అర్థం చేసుకోవటంలో నేను పొరబడే ప్రసక్తే లేదు.

వెళ్ళినపుడల్లా మోనికా నన్ను చూసి నవ్వుతుంది. పలకరిస్తుంది. 'ఇదిగో, మీ కథకు అంగీకారం !' అంటుంది. సంపాదకులు సంతకం చేసి మరీ ఇచ్చిన ఆ అంగీకార పత్రాన్ని




# ఈ కథకేదీ పారితోషికం?


పాలకోడేటి సత్యనారాయణ రావు




అందంగా ఉండే ఒక కవరులో పెట్టి మరీ అందిస్తుంది. 'పోస్టు చేద్దా మనుకొన్నా. కానీ ఎలాగూ మీరు రాస్తారుకదా అని పూరుకొన్నాను! అయినా రికార్డుల్లో పోస్టు చేసినట్లే రాశాను. నాకు యాభై పైసలు ఆదా!'' అంటుంది నవ్వుతూ. ఉత్తరం అందుకొంటాను. ఆ తర్వాత మళ్ళీ ఆ కథ పద్మాక వెడితే, ఆ కథకు పారి తోషిన్ని చెక్కురూపంలో పెట్టి అంది స్తుంది. ''ఈసారీ నాకు ఆదాయే!'' అంటూ.

''అవునూ, ఇన్ని కథలెలా రాస్తారు మీరు?'' అనడిగింది ఒకసారి మోనికా.

నవ్వాను. చెప్దామనుకొన్నాను— 'ఇన్ని అనే ఏంఖర్మ? నువ్వు వచ్చి నా ఇంట్లో నాముందు నవ్వుతూ నవ రత్నాలు చిలికిస్తూ ఉంటే ఎన్ని అయినా రాసేస్తాను' అని! కానీ షరా మామూలుగా మాటలు మూగవై పూరుకొన్నాను. చెప్పదల్చుకొన్నదానికి అందమైన రంగుల్ని పూసి చెప్పాను ''ఏదో చెప్పాలని ఉంటుంది ఆ చెప్పదల్చుకొన్నదాన్ని కాగితంమీద పెడితే కథ అవుతుంది'' అని.

మోనికా ప్రశ్నకు ఇది సరైన సమాధానం కాదు. కానీ సరిగ్గా చెప్ప లేకపోయాను.

ఇంక అలా జరగదు ఇపుడు, ఇదిగో ఇలావెళ్తున్నాకదా, వెళ్ళి మెట్లెక్కి తలెత్తి చూస్తే మోనికా కనిపిస్తుంది. నవ్వుతూ పలకరిస్తుంది. అపుడిస్తాను ఈ ఉత్తరం. నోటితో చెప్పలేనిది, మనసులో మెదులుతున్నదీ ఇపుడు ఈ ఉత్తరంలో అక్షరాలుగా కూర్చి నా మనసుకు, కోర్కెకు అద్దంపడుతూ రాశాను. వెళ్ళి ఇదిలా ఇచ్చి, అట్నుంచి అంగీకారపత్రం అందుకోవటం ఒక్కటే తరువాయి!

మోనికా—బెంగాలీ అమ్మాయి. మన తెలుగింటి అమ్మాయి అంటే బహుశా మాణిక్యం అయి ఉండేదేమో! మాణిక్యం అంటే ఏం బాగుంది. ఆ పేరు తల్చుకొంటే పాత చింతకాయ రాచ్చిప్ప మొద్దు మొహం గుర్తు కొస్తుంది. అదే మోనికా అంటే... ఆధునికత అంతా ఆ పేరులోనే ఉంది, ఇప్పటి నా మోనికాలాగ! ఆ పేరు ఆ బొమ్మకు పెట్టిన ఆమె తల్లి దండ్రులెవరో వారికి నేను జోహార్లు చెప్పుకొన్నాను. ఆమె పెరిగి పెద్దదయి నా ఇంటికి మాణిక్యం అవుతుందని ముందే వూహించుకోగలిగిన వాళ్ళు... గొప్పవాళ్ళు!

మెట్లు ఎక్కాను. ఎక్కుతూంటే గుండెదడ. ఎందు కిలా జరుగుతూంది? గతంలో ఎన్నోసార్లు ఇవే మెట్లెక్కి ఇలాగే చేతిలో కవరుతో వెళ్ళి మోనికా చేతికే అందించాను. కానీ ఎప్పుడూ ఇలాటి భయాలకు నా మనసులో తావే లేకపోయింది. ఈ రోజే, ఇలా కారణం తెలుస్తూంది. కవరున్న కుడిచేయి వణు కుతూ కారణంచెబుతూనే ఉంది. కవరులో ఉన్న విశేషం నా గుండెలో కొత్త వణుకు పుట్టిస్తూంది.

వెళ్ళాను.

తలెత్తి చూసేసరికి మోనికా ఫైళ్ళ మధ్య, కాగితాల మధ్య... ఏదీ. లేదే! చికాకు కలిగింది. అయినా తల పెట్టిన అపూర్వ కార్యక్రమానికి ముందివన్నీ అగ్ని పరీక్షలు కాబోలు—ఇలాటి కష్టాలు ఎదుర్కొన్నాకనే కదా, రాజకుమారితో వివాహం జరిగేది.

శరీరాన్నీ, మనసునూ సర్దుకుని కూర్చున్నాను.

రెండు మూడు నిమిషాల తరవాత వచ్చింది మోనికా, నవ్వుతూనే.

''నమస్కారం!'' అంది పలకరింపుగా.

''హలో!'' అన్నాను నేను.

అలా అన్నానే కానీ మనసులో ఇబ్బంది గానే ఉంది. మగాడిని. మనసిచ్చిన వాడిని. భయపడటం మగవాడికి, అసలు మగ జాతికేకూడా కళంకం అనుకుంటూనే కూర్చున్నాను.

''ఇదిగో, మీ కథకు అంగీకారం!'' అంది డ్రాలోంచి కవరు తీసి ఇస్తూ. అందుకున్నాను. విప్పి చూడలేదు. ఏమంటుందో అందులో తెలుసు గనక, ఇక చదివేందుకు ఏముంటుంది గనక. ''వుయ్ ఆర్ గ్లాడ్.''


చేతిలోని కవరు తీసి టేబిల్ మీద పెట్టాను. కవరు పట్టుకుని అటూ ఇటూ తిప్పి, పక్కన పెడుతూ అంది మోనికా''ఈ సారి పద్ధతిమార్చేశారేం?''

ఉలిక్కి పడ్డాను.ఎలా కనిపెట్టేసింది!

ఈ ఆడాళ్ళు గండెలు తీసే బంట్లు కాదు, గుండెలు తీసుకునే జాణలు!

''ప్రతి సారీ మీరు పారితోషికం తీసుకునేటప్పుడుకదా మరో కథ ఇచ్చేది! ఈ సారిఅంగీకారంతోనే ఇచ్చేస్తున్నారేం! మీకు మేము ఇలా అంగీకారం ఇవ్వటం ఏదో లాంఛనం. అంతేకానీ ఇలా కవర్ ఇవ్వగానే అలా అంగీకరించ బడుతుందని మీకు మాత్రం తెలీదా?''

ఏమంటూంది ఈ అమ్మాయి! ఇవన్నీ నా ప్రశ్నలకు వస్తున్న జవాబులు గానే తోస్తున్నాయి నాకు. అడబోయిన తీర్థం ఈడనే, అడగకనే ఎదురవు




తూంది! ఇన్ని శుభశకునాలు ఏకమై ఎదురొస్తూంటే ఇంకేమిటి భయం!

"ఇది కొత్త కథ. అందుకే ఈ సారి పద్ధతి మార్చాను!" అన్నాను నేను.

మోనికా నవ్వింది. "సర్లెండి .మీరు పద్ధతి మారిస్తే నేను మాత్రం మార్చనా?" అంది సరదాగా. అంటూనే డ్రాలోంచి ఒక కవరు తీసి పైన నా పేరు అందంగా రాసి అందించింది.

"ఏమిటిది? అంగీకారమా!" అనడిగాను.

ఎంత బాగుంది ఇది! అంటే మోనికా ఇదేమిటో వూహించుకో గలిగిందా , వూహించుకుని జవాబును సిద్ధం చేసి పెట్టిందా? అంటే ఇంత కాలమూ నా ఆహ్వానంకోసమే ఎదురుచూస్తూందా? అయ్యయ్యో! ఎంత అన్యాయం జరిగి పోయింది. కొంత ముందుగా మేల్కొని ఉంటే, కొన్ని వసంతాలు కలిసి వచ్చేవి. ఎన్నో రాత్రులు అందంగా గడిచేవి. పొరబాటయి పోయింది. చక్కదిద్దుకో లేని పొరబాటు ఇది.

మోనికా నవ్వింది. ఆ నవ్వులో నా కెన్నో కొత్త విశేషాలు కనపడ్డాయి. ఇంత క్రితం ఎప్పుడూ కనపడని సిగ్గుల మొగ్గలు ఆమె బుగ్గల చిల్లుల్లోంచి బయట పడ్డాయి.

"తీసి చూడండి. మీకే తెలుస్తుంది!" అంది మోనికా.

తీశాను. చదివాను.

గుండె ఎండి పోయింది. క్షణం క్రితం వరకు అందమైన పూవులు పూస్తున్న మనసులో ఇప్పుడు ఆకులు రాలి ఆశలు మోడు లయిపోయాయి.

"ఏమిటిది?" గుండె చిక్కబట్టు కొంటూ అడిగాను.

"అడ్వాన్స్ ఇంటిమేషన్!" అంది మోనికా సిగ్గుతో.

చేతిలో ఉన్న ఆ ఉత్తరం గుండెను కాలుస్తోంది. నా ప్రేయసి పెళ్ళికి ఆహ్వానం ఇది!

టేబిల్ మీద పెట్టిన కవరును వెనక్కు తీసుకోబోయాను.

మోనికా అది చూసింది. "ఏమిటిది? వెనక్కు తీసేసుకొంటున్నారేం? ఇవ్వరా"

"ఇద్దామనే తెచ్చాను, కానీ ఇప్పుడా అవసరం లేదు. దానికి ఉపయోగమూ లేదు!" అన్నాను నేను.

"భలేవారే! ఇవ్వండి ఇటు. కొత్త కథ అన్నారు. అపుడే పాతబడి పనికిరానిదయి పోయిందా?" అంటూనే నవ్వుతూ అందుకొంది. వెంటనే కవరులోంచి ఆ కాగితం తీసింది. "ఇదేమిటి, ఇంత చిన్న కథా?" అంది ఆశ్చర్యపోతూ.

"కథకాదిది, నా భవిష్యత్ జీవితం!" అన్నాను నేను బాధతో.

మోనికా నవ్వేసింది. "కథలురాయటం మానేసి వారఫలాలు మొదలు పెట్టారా ఏం?" అంటూనే చదువుతూనే ఆమె ముఖంలో రంగులు మారాయి. "ఇదేమిటి, ఇలా ... తప్పు చేశారు! మీకు నేను ఎన్నేళ్ళ నుంచి తెలుసు చెప్పండి."

"బహుశా ఆరేళ్ళనుంచి..."

"అవునా, మరి! ఈ నాలుగు వాక్యాల కథ, మీరే అన్నట్లు మీ భవిష్యత్ జీవితం రాసేందుకు ఇంత ఆలస్యం చేశారేం?"

"అంటే? ..."

"ఈ ఉత్తరం కోసమే నేనూ ఎంతో కాలం చూశాను. కానీ, మీ రెన్ని కథలు రాసినా ఈ కథ రాసేలా లేరను కొని చివరకు ఈ నెల మొదట్లోనే ఈ పెళ్ళికి వూ అన్నాను."

"మరి ... మీరు ... నువ్వు నువ్వైనా చెప్పొచ్చు కావేం?"

"నేను ఆడదాన్ని" అంది మోనికా.

ఆ ఒక్క పదంలో వీళ్ళు ఏదైనా చెప్పగలరు.

కానీ ...

మోనికా ఇంకా చెప్పింది "పైగా మీరు తెలుగు వాళ్ళు. తెలుగు కథలు రాస్తారు మీరు. మీకు తెలుగింటి అమ్మాయి పట్ల ... అనుకొన్నాను నేను! పొరపడ్డాను" ఆగి పోయింది మోనికా, చెప్పాల్సిన సంజాయిషి ఇంకేమీ లేదన్నట్లుగా. ఇంత చెప్పినా ఆ చెప్పటంలో ప్రత్యేకత ఏమీ కనబడ్డం లేదు. అంటే ...ఈ నెల మొదటి వరకు ఉన్న నా మీద అభిమానం ... ఏమనాలి అది, ఆ ప్రత్యేకమైన భావానికి ఏం పేరు పెట్టాలి? అది ఇప్పుడు తగ్గి పోయిందా? లేకపోతే ఏ బాధా లేకుండా ఇలా చెప్పేస్తోందేం?

... మోనికా కేసి చూశాను పరీక్షగా. అంత క్రితం వరకు నాకు కనిపించిన మోనికా వేరు. ఇప్పుడు కనిపిస్తున్న మోనికా వేరు. ఈమె అచ్చమైన ఆడది. మాట్లాడే భాష ఏదైనా, మెలిగే తీరు ఒకటే అయినా ఈ ఆడాళ్ళంతా ఒకటే అని చెప్తోంది. నిన్నటి మనసు జీవితానికి మంగళం పాడుతూ, కొత్త జీవితానికి ఆహ్వానం పలుకుతోంది. మనువుకో మరో కథ మొదలుపెడతా నంటోంది.

ఒక్కసారి మనసులోకి చూసుకొన్నాను మనసులో మోనికా లేని లోటు కనిపిస్తోంది. కానీ నా మనసులో ఇంత ఆశలు రేపి, కోర్కెలు చెలరేపి ఇప్పుడు చల్లగా తమ మనసులోని గతానికి ఇంతకాలమూ వేసిన పరదాలు అలాగే ఉంచేస్తా నంటున్న మోనికా ... ఇప్పుడు నాకు కొత్తగా కనిపిస్తోంది. ఎదురుగా ఉన్న ఈ అమ్మాయిని నే నెందుకు పోల్చుకోలేక పోయాను ఇన్నాళ్ళూ! నేను ప్రేమించిన మోనికా కూడా సామాన్యమైన అమ్మాయే కానీ, నగటు ఆడదేనని ఎందుకు గుర్తించలేక పోయాను ఇన్నేళ్ళూ!

కవరు చింపివేశాను.

మనసు గుర్రానికి కళ్ళాలు తగిలించాను.

మెట్లు దిగాను. మెట్లు దిగుతోంటే నాకు మోనికా దూరమవుతూ వచ్చింది. ఇవే మెట్లెక్కి ఎన్నోసార్లు మోనికా దగ్గర్నుంచి ఎన్నో కథలకు అంగీకారం, పారితోషికం అందుకొన్నాను కానీ ... నా సొంత కథలో పాత్రనే నేను సరిగా గుర్తించలేక పోయాను.

అందుకే ఈ కథకు నాకు ఇష్టమైన ముగింపూ లేక పోయింది, ఆమె అంగీకారమూ లేకపోయింది.

అన్నట్లు పారితోషికం ... అవునూ, అదీ లేకపోయింది! !

*